పందిరి కింద చదువులు



విద్యార్థులకు పందిరి కింద బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- మంజూరు కాని పాఠశాల భవనం
- ఇబ్బంది పడుతున్న మహరాజ్‌గూడ విద్యార్థులు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ముకదంగూడ గ్రామ పంచాయతీ పరిధి మహరాజ్‌గూడ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం లేక పందిరి కింద విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

25 ఏళ్లుగా..

మహరాజ్‌గూడ ప్రాథమిక పాఠశాలలో 19 మంది విద్యార్థులు ఉన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదువులు కొనసాగుతున్నాయి. అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు విద్యా బోధన చేస్తున్నారు. గ్రామంలో 78 కుటుంబాలు ఉండగా 276 జనాభా ఉంది. 1999లో పాఠశాలను స్థాపించగా, అప్పటి నుంచి పందిరి కింద వరండాపై చదువులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు ఇంటి ఎదుట ఉన్న పందిరి కింద తరగతులు నిర్వహిస్తున్నారు. పందిరి పక్క నుంచే సీసీ రోడ్డు ఉండడంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రత నిలుపలేకపోతున్నారు. కాగా గ్రామంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాల కూడా ఉంది. అందులో 22 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారంతా పక్కా భవనంలో చదువులు కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

భవనం నిర్మించాలి



25 ఏళ్లుగా మా గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భవన నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి.

– జాదవ్ మోతీరాం, గ్రామ పెద్ద

ఏకాగ్రత ఉండడం లేదు



ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నప్పుడు పశువులు మా సమీపంలోనే సంచరిస్తున్నాయి. వాటిని తరిమేసే క్రమంలో ఏకాగ్రత చెదిరిపోతుంది. ప్రతిరోజు ఇలాగే జరుగుతుంది. చదువుకుంటున్న పందిరికి ఆనుకొని సీసీ రోడ్డు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– జాదవ్ పూజా, 3వ తరగతి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రతీ సంవత్సరం యూడైస్ పూరించే వేళ పాఠశాలకు తరగతి గదులు నిర్మాణం గురించి ప్రస్తావిస్తున్నాం. అయినా ఇప్పటి వరకు పాఠశాల భవనం మంజూరు కాలేదు. విషయాన్ని నేరుగా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– ఎస్. దయాకర్, ప్రధానోపాధ్యాయుడు

అంతర్గత రహదారులకు మహర్దశ



పెంచికల్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు (ఫైల్)

- సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.40 కోట్లు మంజూరు
- ప్రారంభం కాని పనులు
- మార్చి చివరి వరకు గడువు

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ పట్టింది. గ్రామాల్లోని అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో రూ. 1కోటి 40లక్షల నిధులు మంజూరు చేసింది.

గ్రామాల వారీగా మంజూరైన నిధులు..

పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీకి రూ.10లక్షలు, ఎల్లూర్‌కు రూ. 20లక్షలు, ఎల్లపల్లికి రూ.20లక్షలు, చేడ్వాయికి రూ. 20లక్షలు, పోతెపల్లికి రూ.10లక్షలు, కొండపల్లికి రూ.25 లక్షలు, బొంబాయిగూడకు రూ.10 లక్షలు, లోడుపల్లికి రూ.5లక్షలు, కమ్మర్‌గాంకు రూ.5లక్షలు, మురళీగూడకు రూ.5లక్షలు, దరోగపల్లికి రూ.5లక్షలు, అగర్‌గూడకు రూ.5లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

మార్చి నెల వరకు గడువు..

ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో గ్రామాల్లో మార్చి నెలాఖరు వరకు అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై వారం రోజులు గడుస్తున్నా నేటికీ గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు. ఉపాధిహామీ పథకంలో నిర్మించనున్న రోడ్లకు పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తీర్మానాలు అందించాల్సి ఉండగా నేటికీ అధికారులు అటువైపు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సకాలంలో రోడ్ల నిర్మాణాలు పూర్తి కాకుంటే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



ప్రభుత్వం గ్రామాల్లో బురదమయంగా ఉన్న అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లను నిర్మించడానికి నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. గ్రామాల్లో నేటికీ సీసీ రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి నిధులు మంజూరైన రోడ్లను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– పందిర్ల ప్రమోద్, కొండపల్లి

క్లుప్తంగా

‘గ్రూప్ –4’లో సత్తా చాటిన యువకుడు



నరేష్

పెంచికల్‌పేట్: మండల కేంద్రానికి చెందిన ముప్పిడే సుశీల –సత్యనారాయణ దంపతుల కుమారుడు ముప్పిడే నరేష్ ఇటీవల విడుదల చేసిన గ్రూప్ –4 ఫలితాల్లో జిల్లాలో 9వ ర్యాంకు సాధించాడు. గతంలో పోలీసు ఉద్యోగాలకు నిర్వహించిన పరీక్షల్లో సివిల్ కానిస్టేబుల్‌గా సైతం ఎంపికయ్యాడు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన నరేష్, మంచిర్యాలలో ఇంటర్, హైదరబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఏడాదిగా పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. మిత్రుల సహకారంతోనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రెండు కొలువులు సాధించినట్లు తెలిపాడు.

యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

రెబ్బెన: యువత గ్రామీణ క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గోలేటిలోని యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ యువత సమయాన్ని వృధా చేసుకోకుండా తమకు నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ అందించే ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



పరిచయం చేసుకుంటున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కబడ్డీ క్రీడా పోటీలను ఎస్సై గంపుల విజయ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల వల్ల శరీర దారుఢ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కిష్టు నాయక్, గ్రామ పెద్దలు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులు కరాటే టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో బ్రౌన్ బెల్ట్‌లో బిందూప, అశ్విత్ యాదవ్, శ్రీనాథ్, వివేక్ తేజ, అబ్దుల్ అయాన్‌లు స్పారింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ దేవయ్య తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన



వివరాలు నమోదు చేస్తున్న వైద్యసిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాబంధు ఫౌండేషన్, న్యూట్రీషియన్ ప్లస్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈసందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కీర్తి, నవ్యశ్రీ, సుమిత్‌గుప్తా, షర్మిల, హీనాటాంగ్, ట్రైనర్లు తానియా, గాబా, పూజా తలాని, కమిషనర్ అంజయ్య, ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

‘భారత్ బంద్’ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయికులు

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన భారత్‌బంద్ పోస్టర్లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగ ఉపేందర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ భారత్‌బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి కుమార్, నాయకులు నారాయణ, నరేశ్, కిషన్, ధర్మయ్య, అంజి, జయకర్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మార్కండేయ జయంతి



పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



రెబ్బెనలో..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ మార్కండేయ జయంతిని కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి గణపతి హోమం, ధ్వజారోహణము, హోమం, పూర్ణాహుతి, మంగళ హారతులు, మహా మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పొట్టి శ్రీరాములుచౌక్, గాంధీచౌక్, వివేకానందచౌక్, అంబేద్కర్ చౌక్‌ల మీదుగా మార్కండేయుడి శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, సంఘ ప్రతినిధులు జంజిరాల శ్రీనివాస్, లింగయ్య, ధర్మయ్య, చిప్ప సురేష్, శ్రీకాంత్, సంజీవ్, మోహన్, మధుకర్, రాంపల్లి సత్యనారాయణ, దాసరి రాజు, రవీందర్, శ్రీకాంత్, ధర్మయ్య, మహిళా నాయకులు రాంపల్లి విజయ, ఇరుకుల మంగ, సునీత, పుష్పలత, పద్మశాలీ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటిలో పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు మారిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలీల కులదైవం మార్కండేయుడి జయంతి అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుండేటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, మహిళలు స్వరూపారాణి, మంగ, శ్రీదేవి, జయశ్రీ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ సోమవారం తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

16న ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 16న గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఆయుర్వేద వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సౌకర్యం కోసం డ్రైనేజీ, కల్వర్టు నిర్మిస్తున్నామని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొటగూడ గ్రామంలో కల్వర్టు, డ్రైనేజీలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రూ.6లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, అంబరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాలేశ్వరస్వామి నవరాత్రులు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని భక్తుల కొంగు బంగారం శ్రీ బాలేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించే బాలేశ్వరస్వామి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో అర్చకులు శ్రీధర్, అజయ్, డిల్లీ విజయ్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, రుద్రహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు సత్యనారాయణ, వినయ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల సర్వే నిర్వహించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి శివారులో గల ప్రభుత్వ స్థలాల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించాలని కోరుతూ సోమవారం బీఎస్పీ నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎల్కపల్లిలో సర్వే నంబరు 61, ఎల్లూర్‌లో సర్వే నంబరు 342లో గల వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన పెంచికల్‌పేట్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి, మండల కేంద్రంలో క్రీడా మైదానం కోసం ప్రభుత్వ భూములను సర్వే చేసి గుర్తించాలన్నారు. అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బిట్టి శ్రీనివాస్, రామిళ్ల దేవాజీ, పాగిడే ఆశన్న, శంకర్‌గౌడ్, లచ్చన్న, చందు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని సోమవారం మిల్లు యూనిట్ హెడ్ ఏకే మిత్రాజి ప్రారంభించారు. ఎస్పీఎం కన్స్యూమర్ స్టోర్స్ ఆవరణలో నిర్వహించగా, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ అంశాలపై 100 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగులు, ఎస్పీఎం మిల్లు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రవీణ్



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన దుర్గం ప్రవీణ్‌ను బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి(యువజన బాధ్యతలు)గా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నియమించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ పార్టీ నాయకులు దుర్గం ప్రవీణ్‌ను ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. నాయకులు సిద్దు, శివరాం, శుభం, రవి, రజనికాంత్, దేవాజీ, అనిల్, అరవింద్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకులు రఫీక్ ఖాన్, సయ్యద్ నసీం, అమ్రెజ్‌లు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నాయకులు ఎమ్మాజీ సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’కి వివరాలు అందించాలి



వివరాల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: గ్రామాల్లో గృహజ్యోతి పథకం అమలులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు అవసరమైన ధ్రువపత్రాలను విద్యుత్ అధికారులకు అందించాలని కాగజ్‌నగర్ డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గృహజ్యోతి పథకంలో వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హుల వద్ద నుంచి పకడ్బందీగా వివరాలను సేకరించాలని సూచించారు. గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ 200 యూనిట్ల లబ్ధి కోసం దరఖాస్తుదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్, రేషన్ కార్డు, ఆధార్ కార్డ్, ఫోన్, ప్రజాపాలన రశీదు నంబర్ వివరాలను అందించాలన్నారు. మహాలక్ష్మి పథకంలో గ్యాస్ కనెక్షన్ కోసం వివరాలు అందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో మానిక, కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు



ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్సై

కౌటాల: వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గురుడుపేట గ్రామంలోని కుమురం భీం చౌరస్తా వద్ద సోమవారం కౌటాల–బెజ్జూర్ ప్రధాన రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు గ్రామాల్లో నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్‌లో మాట్లాడొద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న మనోహర్

బెజ్జూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రిజిస్టర్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను సైతం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి పర్శ, సంజీవ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున సమ్మక్క, సారక్క జాతర ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం పర్మినెంట్ నిర్మాణాలైన స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించే పనులను పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రత్యేక నిధులు తీసుకొచ్చారని, వాటితో పనులను పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు.

చిన్నారిని కాపాడిన వ్యక్తికి సన్మానం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం శ్రీనివాస కాలనీలో ఓ చిన్నారిని ఒక మహిళ తీసుకెళ్తుండగా, అడ్డుకుని ఆ మహిళను స్థానికులకు అప్పగించి, చిన్నారిని కాపాడిన ఆశీర్వాద్ విల్సన్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన నివాసంలో సన్మానించారు. బీఆర్‌ఎస్ పార్టీ 10వ వార్డు జనరల్ సెక్రటరీగా ఉన్న ఆశీర్వాద్ చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే వారిని పసిగట్టి, వారిని పట్టుకున్నందుకు ఆ చిన్నారి తల్లిదండ్రులు, మాజీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.